## క్లుప్తంగా

### వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఇంటూరి చిన్నా



జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శిగా జగ్గయ్యపేటకు చెందిన ఆ పార్టీ నాయకుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ ఇంటూరి రాజగోపాల్(చిన్నా) నియమితులైనారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఇంటూరి రాజగోపాల్(చిన్నా)ను రాష్ట్ర కార్యదర్శిగా నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది.

### ట్రై సైకిల్ అందజేత



వత్సవాయి: పొట్టి శ్రీరాములు సేవా ట్రస్టు ఆధ్వర్యంలో మండలంలోని లింగాల గ్రామానికి చెందిన వృద్ధురాలికి జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు బొగ్గవరపు వెంకట రాజారావు గురువారం ట్రై సైకిల్‌ను అందజేశారు. లింగాల గ్రామానికి చెందిన పాలపాటి సక్కుబాయి నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ట్రై సైకిల్ కావాలని అడగడంతో పొట్టి శ్రీరాములు సేవా ట్రస్టు ద్వారా అందించినట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ట్రస్టు సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో జేఎస్పీ మండల అధ్యక్షుడు రేగండ్ల వెంకటరామయ్య, ఉపాధ్యక్షుడు జొన్నల రామకోటేశ్వరరావు, షేక్ మీరా తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



వీరులపాడు: సిటిజన్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఆరు రాష్ట్రాల్లో 42 శాఖల ద్వారా రూ.4,200 కోట్లకు పైగా వ్యాపారం సాగిస్తోందని ఎండీ కేవీ సుబ్బయ్య తెలిపారు. వీరులపాడు బ్రాంచ్ ఆధ్వర్యంలో పది, ఇంటర్ మీడియట్‌లో 95 శాతం మార్కులు సాధించిన ఇరువురు షేర్ హోల్డర్స్ పిల్లలకు గురువారం ఆయన ప్రతిభా పురస్కారాలు, ఒకొక్కరికి రూ.10 వేలు నగదు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో సభ్యులకు 18 శాతం డివిడెంట్ చెల్లించడం జరిగిందన్నారు. 26 ఏళ్లుగా 10, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ పువ్వాడ శివకృష్ణ చైతన్య, చావా కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### రైతుబజారులో పామాయిల్ కౌంటర్ ప్రారంభం



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని రైతుబజారులో పామాయిల్ విక్రయానికి ప్రత్యేక కౌంటర్‌ను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) గురువారం ప్రారంభించారు. బహిరంగ మార్కెట్‌లో ఆయిల్స్ ధరలను అదుపుచేసేందుకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతుబజారులో పామాయిల్ ప్రత్యేక కౌంటర్‌ను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కేజీ పామాయిల్ రూ.115 మాత్రమేనన్నారు. కార్యక్రమంలో డీటీ నాగరాజు, రైతుబజారు ఎస్టేట్ ఆఫీసర్ వెంకటరమణ పాల్గొన్నారు.

### ఈ-క్రాప్ నమోదు పరిశీలన



తిరువూరు: వ్యవసాయ శాఖ ఈ-క్రాప్ నమోదు చేసే విధానాన్ని తిరువూరు రెవెన్యూ డివిజినల్ అధికారి కె. మాధురి గురువారం తనిఖీ చేశారు. మండలంలోని చింతలపాడు, గానుగపాడు గ్రామాల పరిధిలోని రైతులను నేరుగా కలిసిన ఆర్డీఓ వారు సాగుచేస్తున్న పంటల వివరాలు, ఈ-క్రాప్‌లో నమోదైన వివరాలను తనిఖీ చేశారు. ఈ-క్రాప్ నమోదుకు వీఆర్వోలు, వీఆర్ఏలు, గ్రామ వ్యవసాయ సహాయకులు అందుబాటులో ఉండాలని, సకాలంలో ఈ-క్రాప్ నమోదు చేసి రైతులకు ప్రభుత్వపరమైన పథకాల ద్వారా లబ్ధి చేకూరేందుకు సహకరించాలని ఆర్డీఓ ఆదేశించారు.

### ముగిసిన శిక్షణ తరగతులు

విజయవాడరూరల్: గ్రామ పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే ఆదాయ వనరులు గ్రామాల్లో అభివృద్ధి పనులకు వినియోగించడంపై అవగాహన కలిగి ఉండాలని ఈఓఆర్డీ ఎండీవీ ప్రసాద్ తెలిపారు. విజయవాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో ఉప సర్పంచ్‌లకు, పాలకవర్గ సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి.

# అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రహదారి



శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా గోకరాజుపల్లి గ్రామ శివారులోని కల్వర్టు



గోకరాజుపల్లి-రంగాపురం ఆర్‌అండ్‌బీ రహదారిపై పడిన గుంత

- గుంతలమయంగా గోకరాజుపల్లి-రంగాపురం రోడ్డు
- శిథిలావస్థకు చేరిన కల్వర్టు
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

వీరులపాడు: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా మండలంలోని ఆయా గ్రామాలను అనుసంధానం చేసే ఆర్‌అండ్‌బీ రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. 15 కి.మీల మేర పొడవున్న మండలంలోని గోకరాజుపల్లి నుంచి రంగాపురం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి మధ్యలో గుంతలు పడి ప్రమాదాలకు నిలయంగా మారింది. జగ్గయ్యపేట నియోజకవర్గంలోని వత్సవాయి, నందిగామ మండలాలను అనుసంధానం చేసే ప్రధాన రహదారిగా ఈ మార్గం ఉంది. మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వెళ్లి వచ్చేందుకు కూడా ఈ రహదారి ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ఈ రహదారిలో గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురైన ఘటనలు అనేకం ఉన్నాయి.

**ప్రమాదకరంగా కల్వర్టు..**

గోకరాజుపల్లి - రంగాపురం గ్రామాలను కలిపే ఆర్‌అండ్‌బీ రహదారిలో గోకరాజుపల్లి గ్రామ శివారులో ఎన్ఎస్పీ కాల్వపై కల్వర్టు శిథిలావస్థకు చేరింది. రెండు దశాబ్దాల క్రితం నిర్మించినది కావడంతోపాటు నాటి నుంచి నేటి వరకు కనీస మరమ్మతులు చేయలేదు. కూలేందుకు సిద్ధంగా ఉన్న ఈ కల్వర్టుతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని పరిసర గ్రామాల ప్రజలు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. కాల్వకు ఇరుపక్కలా వ్యవసాయ భూములున్నాయని ఈ కల్వర్టు ద్వారా ట్రాక్టర్‌లు, ఆటోలపై కూలీలను బిక్కుబిక్కుమంటూ తరలించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పట్టించుకోని అధికారులు..**

రహదారి ధ్వంసమైనా, కల్వర్టు శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారినా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కల్వర్టు పరిస్థితిని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయడంతోపాటు కల్వర్టు స్థానంలో బ్రిడ్జి నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు, వాహనదారులు కోరుతున్నారు.

దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ శశిభూషణ్‌ను వివరణ కోరగా ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలకు గోకరాజుపల్లి-రంగాపురం రహదారి దెబ్బతిన్నదన్నారు. త్వరలోనే రహదారికి మరమ్మతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

# రతన్ టాటాకు ఘన నివాళి



రతన్ టాటా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టాటా ఫైనాన్షియల్ సర్వీస్ అసోసియేట్

జగ్గయ్యపేట అర్బన్: రతన్ టాటా మృతితో దేశం ఒక గొప్ప పారిశ్రామిక దిగ్గజాన్ని కోల్పోయిందని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య అన్నారు. గురువారం ఎమ్మెల్యే నివాసంలో టీడీపీ నేతలతో కలిసి ఆయన రతన్ టాటా చిత్రపటానికి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు రతన్ టాటా మృతికి సంతాపం తెలిపారు. స్థానిక ఏబీఏ లైఫ్ ఇన్సూరెన్స్ ఆఫీసులో రతన్ టాటా చిత్రపటానికి టాటా ఫైనాన్షియల్ సర్వీసెస్ అసోసియేట్ పెంటి శ్రీనివాసరావు నివాళులర్పించారు. పేట బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ టి.కిరణ్, బిజినెస్ అసోసియేట్ ఐఎస్ఆర్ శ్రీనివాస్, కిరణ్‌కుమార్, సుకన్య, రమణారెడ్డి, జార్జి, శ్రావణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నందిగామ టౌన్: దేశం గర్వించదగ్గ పారిశ్రామికవేత్త రతన్ టాటాను కోల్పోయామని పౌర సమాజ ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. స్థానిక ముక్కోటి మహా మండపం వద్ద గురువారం రతన్ టాటా చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన పవిత్రాత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. నాయకులు పారేపల్లి సాయిబాబు, మారం అమరయ్య, పరిశ మల్లికార్జునరావు, సముద్రాల నాగేశ్వరరావు, వేణు, మౌలా, శ్యాం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# అమ్రితసాయిలో దసరా సంబరాలు



బతుకమ్మ పాటలు పాడుతూ డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

కంచికచర్ల: పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం దసరా సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కే రామ్మోహనరావు మాట్లాడుతూ దసరా అంటే చెడుపై మంచి సాధించిన విజయంగా దుష్ట శిక్షణ జరిగి అందరూ ఆనందంగా ఉండే రోజు అని అన్నారు. జమ్మిచెట్టుపై ఉంచిన ఆయుధాలకు పూజలు చేసిన అనంతరం యుద్ధంలో పాల్గొన్న పాండవులు విజయం సాధించారని తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం శశిధర్ మాట్లాడుతూ విజయదశమి రోజున ఏ కార్యక్రమం ప్రారంభించినా విజయం వరిస్తుందని అన్నారు. అనంతరం అందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులు బతుకమ్మ పాటలు పాడుతూ డ్యాన్స్ చేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# జగజ్జననీ నమోస్తుతే

## దుర్గాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



పేటలోని శ్రీరేణుకాపరమేశ్వరి ఆలయంలో శ్రీదుర్గాదేవి



మహాలక్ష్మి వెండి దేవాలయంలో శ్రీదుర్గాదేవి అలంకరణ



పేటలోని మార్కండేయ బజారులోని మండపంలో..



నందిగామలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో..



దుర్గాదేవిగా నందిగామలోని మరిడీ మహాలక్ష్మి అమ్మవారు



అల్లూరులో దుర్గాదేవిగా మహాలక్ష్మి అమ్మవారు



కంచికచర్ల కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు



గౌరవరంలో దుర్గాదేవి అలంకారంలో అమ్మవారు



ముక్త్యాలలో దుర్గాదేవి అలంకారం



మక్కపేట ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో అమ్మవారు

వత్సవాయి: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను గాజులతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దంపతులు పీటలపై కూర్చుని పూజాక్రతువులు జరిపించారు. అలాగే సాయంత్రం మహిళలు విగ్రహాల వద్ద రంగు రంగు పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను ఒకచోట పేర్చి ఆడిపాడారు.

నందిగామ టౌన్: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం మండలంలోని అంబారుపేట గ్రామంలో వేంచేసియున్న సత్యమ్మ అమ్మవారు కనకదుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను ఆలయ ఈఓ హరిగోపీనాథ్ పర్యవేక్షించారు. పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తి పీఠంలోని కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞాన సరస్వతీ అమ్మవార్లు కనకదుర్గమ్మగా పూజలందుకున్నారు. అదేవిధంగా గోళ్లమూడి శంభులింగేశ్వర స్వామి, కూడలి సంగమేశ్వరస్వామి ఆలయాల్లో పార్వతీ మాతకు పూజలు, అర్చనలు చేశారు. పట్టణంలోని రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో శుకశ్యామలాంబ, వాసవీకన్యకా పరమేశ్వరీ, మరిడీ మహాలక్ష్మి, లింగాలపాడు గ్రామంలో లక్ష్మీపేరంటాళ్లమ్మవారిని కనకదుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చనలు, అష్టోత్తర సహస్ర నామార్చనలను నిర్వహించారు. అలాగే చందర్లపాడుతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు.

జగ్గయ్యపేట అర్బన్: శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా గురువారం అమ్మవారు శ్రీకనకదుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకొని అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్థానిక నకాశిబజారులో వేంచేసి ఉన్న శ్రీకనకదుర్గమ్మ ఆలయం, అద్దాలబజారులో ఉన్న శ్రీమహాలక్ష్మి అమ్మవారి వెండి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే దుర్గాపురంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయం, చెరువుబజారులో ఉన్న శ్రీరేణుకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అద్దాలబజారులో ఉన్న శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయం, మార్కండేయ బజారులోని మండపంలో, తోటబజారులోని మండపంలో, ఆనందసాయి ఆలయంలో ఇంకా పలు అమ్మవారి ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

జగ్గయ్యపేట: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారు గురువారం దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముక్త్యాల, వేదాద్రి, అనుమంచిపల్లి, షేర్‌మహ్మద్‌పేట, జయంతిపురం గ్రామాల్లోని మండపాల్లో అమ్మవారు దుర్గాదేవిగా పూజలు అందుకున్నారు. అదేవిధంగా గౌరవరంలోని అమ్మవారి మండపం వద్ద ప్రత్యేక హోమాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

కంచికచర్ల: స్థానిక శివసాయి క్షేత్రంలో గురువారం అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. అదేవిధంగా మహాలక్ష్మి ఆలయం, వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. స్థానిక పశువుల ఆసుపత్రి రోడ్డు, ఫైర్‌స్టేషన్ రోడ్డులో అమ్మవారికి చలవ మండపాలు ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో అమ్మవారికి విశేష పూజలు చేశారు.

వీరులపాడు: మండలంలోని అల్లూరు గ్రామంలో వేంచేసియున్న సీతారామచంద్ర సహిత మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో గురువారం నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు కనకదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్త అల్లూరి భాస్కరరావు, అంజనాదేవి దంపతులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అదేవిధంగా వెల్లంకి గ్రామంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని కనకదుర్గగా అలంకరించి పూజలు, అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కూడలి సంగమేశ్వరస్వామి ఆలయంలో సామూహిక కుంకుమార్చనలు

# సర్వసభ్య సమావేశానికి మొక్కుబడిగా అధికారులు



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ మల్లికార్జునరావు

కంచికచర్ల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారులు మొక్కుబడిగా వస్తున్నారని వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు అన్నారు. కంచికచర్ల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వైస్ ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాల్సి ఉండగా కొంతమంది డుమ్మా కొడుతున్నారని మండిపడ్డారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వడంలేదని ఆరోపించారు. 15వ ఆర్థిక సంఘం నిధులను మండల పరిషత్ ద్వారా గ్రామాల్లో చేపట్టిన పనులకు వెంటనే బిల్లులు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా నిధులు మంజూరయ్యాయని వాటిని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్ఆర్‌జీఎస్ పథకం ద్వారా మండలానికి రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని 2025 జనవరి కల్లా అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని చెప్పారు. కొన్ని గ్రామాల్లో పంట నష్టం జరిగినా వాటి గురించి అధికారులు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మండల వ్యవసాయ అధికారి కే విజయకుమార్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు తమ పంటలను తక్షణమే ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఇటీవల నష్టపోయిన పంటలకు 80శాతం మంది రైతులకు వారి బ్యాంకు ఖాతాలో పరిహారం జమచేయడం జరిగిందన్నారు. రబీ సీజన్‌లో పుల్లశెనగ సాగుచేసే రైతులకు 25శాతం రాయితీతో విత్తనాలు అందజేయడం జరుగుతుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ వెలగలేటి మాధవి, జెడ్పీటీసీ సభ్యుడు వేల్పుల ప్రశాంతి, సర్పంచి వేల్పుల సునీత, ఎంపీడీఓ విజయలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చైన్ స్నాచర్‌కు దేహశుద్ధి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో ఓ చైన్ స్నాచర్ గురువారం హల్‌చల్ చేశాడు. స్థానిక కుమ్మరి బజార్‌లో నడుచుకుంటూ వెళుతున్న అన్నపూర్ణ అనే మహిళ మెడలో బంగారు నానుతాడు లాక్కుని పరారయ్యాడు. ఆమె కేకలు విన్న స్థానికులు చైన్ స్నాచర్‌ను వెంబడించి మెయిన్ బజార్‌లోని ఆరు పంపుల సెంటర్ వద్ద పట్టుకుని దేహశుద్ధి చేశారు. అతని వద్ద చైన్‌ను స్వాధీనం చేసుకుని బాధిత మహిళకు అప్పగించారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా అందరూ దుర్గమ్మ ఆలయం దసరా మహోత్సవాల విధుల్లో ఉన్నట్లు తెలుసుకుని వారే స్వయంగా నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి పోలీస్ సిబ్బందికి అప్పగించారు. బాధిత మహిళతో ఫిర్యాదు చేయించారు.



జగ్గయ్యపేటలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

# ముగిసిన బతుకమ్మ సంబరాలు

జగ్గయ్యపేట: దసరా పండుగ సందర్భంగా మహిళలు బతుకమ్మలాటలు ఘనంగా నిర్వహిస్తున్నారు. పలు రకాల పూలతో ప్రత్యేకంగా తయారు చేసిన బతుకమ్మలకు మహిళలు విశేషంగా పూజలు చేసి పాటలు పాడుతూ బతుకమ్మలాడారు. పూజల అనంతరం సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. పట్టణంలోని బ్రాహ్మణ బజారులో బతుకమ్మలకు పూజలు నిర్వహించారు.

# గో సంరక్షణతో సనాతన ధర్మం నిలబడుతుంది

## బద్రీనాథ్ పీఠాధిపతి అవిముక్తేశ్వరానంద సరస్వతి



అవిముక్తేశ్వరానంద సరస్వతికి స్వాగతం పలుకుతున్న భక్తులు

జగ్గయ్యపేట అర్బన్: గోవులు సుభిక్షంగా ఉంటేనే సనాతన ధర్మం నిలబడగలదని బద్రీనాథ్ పీఠాధిపతి శ్రీపరమ పూజ్య జగద్గురు శంకరాచార్య అవిముక్తేశ్వరానంద సరస్వతి అన్నారు. గోప్రతిష్ఠ ఆందోళన అనే కార్యక్రమంతో అవిముక్తేశ్వరానంద సరస్వతి స్వామి దేశవ్యాప్త పర్యటనలో గురువారం పట్టణ సమీపంలోని జాతీయ రహదారిపై ఫుడ్‌ప్లాజా వద్ద వేదమూర్తులు పిల్లలమర్రి నాగకృష్ణశర్మ ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సరస్వతి స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ గోవులను రక్షించాలని, వాటిని జాతీయ సంపదగా గుర్తించాలని, గోవులకు హానీ చేసే వారిని శిక్షించాలన్నారు. కావున భక్తులంతా గోసంరక్షణకు సమాయత్తమవ్వాలని సూచించారు. తెలంగాణ నుంచి ఏపీలోకి ప్రవేశించిన అవిముక్తేశ్వరానంద సరస్వతి స్వామికి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) జాతీయ రహదారిపై ఫుడ్ ప్లాజా వద్ద స్వాగతం పలికారు.